క్లుప్తంగా

ఘనంగా అమృత కలశయాత్ర



తిరుపతి అర్బన్: తిరుపతిలోని జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బుధవారం సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఆఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో అమృత కలశయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ యాత్రను వీసీ జీఎస్ కృష్ణమూర్తి ప్రారంభించారు. దేశభక్తి, మాతృభూమికి సంబంధించిన పలు అంశాలను ఆయన వివరించారు. కో ఆర్డినేటర్లు చందూలాల్, సేతురామ్, బుల్దీదాస్, జగన్మోహన్, కే.కుమార్, ఆదెన్ననాయక్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కండీషన్ బాధ్యత డీఎంలదే

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నడిచే ఆర్టీసీ బస్సుల కండీషన్ బాధ్యత డిపో మేనేజర్లదేనని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం జిల్లాలోని 11 డిపోల మేనేజర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు డిపోల వారీగా కేటాయించిన సర్వీసులు నడపాలన్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లాగే నవరాత్రి బ్రహ్మోత్సవాలనూ విజయవంతం చేయాలని సూచించారు. డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్, డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ నరసింహులు, పీవో పార్థసారథి పాల్గొన్నారు.

తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా దాసు నియామకం

తిరుపతి మంగళం: తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా టీటీడీ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకుడు టి.దాసు నియమితులయ్యారు. ఆయన బుధవారం తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి సమక్షంలో ఎండీ నుంచి నియామక పత్రం అందుకున్నారు.

పేదలకు అన్నదానం



తిరుపతి కల్చరల్: పేద ప్రజల సంక్షేమానికి బాటలు వేస్తూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి కొనియాడారు. రుయా ఆసుపత్రి వద్ద బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని 1500 మంది పేదలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ సుబ్బారావు, తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కల్లూరు నాగరాజు గౌడ్, వైఎస్సార్ సీపీ నేతలు రాజేష్, నాగేంద్ర, గిరి, రాజశేఖర్, కుమార్ పాల్గొన్నారు.

బాలికలకు దుస్తుల పంపిణీ



తిరుపతి కల్చరల్: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సంస్థ బుధవారం సరోజినీ దేవి రోడ్డులోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలోని బాలికలకు స్వీట్లు, దుస్తులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి అధ్యక్షుడు ఎం.భాస్కర్, కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి చక్రపాణి, సహాయ కార్యదర్శి జి.శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

తిరుపతి కల్చరల్: మతతత్వ శక్తుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకుందామని వీసీకే ఏపీ అధ్యక్షుడు ఎస్‌జే.విద్యాసాగర్ పిలుపునిచ్చారు. బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో బుధవారం వీసీకే రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విభజన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీలు మోదీ ప్రభుత్వం నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు.

ఒక శాతం నిధులపై రాద్ధాంతమేల..?

- తిరుపతి అభివృద్ధి వారికి ఇష్టం లేదా?
- మీడియాలో కనిపించేందుకేనా ఆ ఆరాటం
- విమర్శకులపై మండిపడుతున్న నగర సిటీజన్లు

తిరుపతి తుడా: తిరుపతి నగర అభివృద్ధికి టీటీడీ బడ్జెట్‌లో ఒక శాతం నిధులు కేటాయిస్తూ మూడు రోజుల క్రితం టీటీడీ ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయంపై అన్ని రాజకీయ పార్టీల నేతలు (ఏపీలో మనుగడలేని రెండు పార్టీలు మినహా), ప్రముఖులు, మేధావులు, నగరంలోని మెజారిటీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం ఎప్పుడో జరగాల్సిందని, టీటీడీని ఆలస్యంగానైనా భాగస్వామ్యం చేశారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఉద్యోగం చేసి ఎక్కడో స్థిరపడిన ఒకరిద్దరు స్వయం ప్రకటిత మేధావులు, తమ రాజకీయ పార్టీల విధానాల పేరుతో ఓ పది మంది, సొంత రాజకీయ ప్రయోజనాల కోసం మరో ఇద్దరు ముగ్గురు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాద్ధాంతం చేస్తున్నారు. భక్తుల ఆదరణ లేని, తిరుపతితో సంబంధం లేని స్వయం ప్రకటిత స్వాములు ఒకరిద్దరు సామాజిక మాధ్యమాల్లో విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై తిరుపతి వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చరిత్ర హీనులుగా నిలిచిపోతారని పేర్కొంటున్నారు.

చరిత్ర తెలుసుకోవాలి



తిరుమల పాలన, ఆలయ నిర్వహణ కోసమే తిరుపతి పురుడుపోసుకుంది. కొన్ని వందల ఏళ్ల క్రితం అర్చకులు, భక్తులు చీకటి పడితే తిరుమలలో ఉండేవారు కాదు. అర్చకులు ఎలమండ్యం, గొల్లపల్లి, అగ్రహారం తదితర గ్రామాల నుంచి తిరుమలకు నడిచి వెళ్లి పూజలు చేసి సాయంత్రానికి కొండ దిగడం కష్టంగా ఉండేదట. వీరి ఇబ్బందులు తొలగించాలనే రామానుజాచార్యులు 12వ శతాబ్దంలో గోవింద రాజపురం గ్రామ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాటి గోవిందరాజ పురమే నేటి తిరుపతి. శ్రీవారి ఆశిస్సులతో పురుడుపోసుకున్న తిరుపతి అభివృద్ధిలో టీటీడీ భాగస్వామ్యం కావడం అనివార్యం.

–భూమన సుబ్రమణ్యంరెడ్డి, రాయలసీమ అధ్యయనాల సంస్థ, అధ్యక్షుడు

సగానికిపైగా తిరుపతి టీటీడీదే



తిరుమల శ్రీవారికి సేవ చేసే వారికి, భక్తులకు వసతి, ఇతర సదుపాయాలు కల్పించడానికి ఏర్పడిన జనావాసమే తిరుపతి. ఇక్కడ గోవిందరాజ స్వామి, కపిలేశ్వర స్వామి, కోదండరామ స్వామి ఆలయాలు, (1933 వరకు తాతయ్య గుంట గంగమ్మ ఆలయం) శ్రీనివాసం, మాధవం, విష్ణు నివాసం, ఎస్వీ అతిథి గృహం, పద్మావతి అతిథి గృహం, సత్రాలు, పాఠశాలలు, కాలేజీలు, ఆసుపత్రులు, ఖాళీ స్థలాలు, టీటీడీ కార్యాలయాలు అన్నీ లెక్కిస్తే సగానికి పైగా ఆస్తులు టీటీడీవే. రోజూ లక్షలాది మంది యాత్రికులు వస్తుండడం వల్ల తిరుపతి అభివృద్ధికి టీటీడీ వార్షిక బడ్జెట్‌లో ఒక శాతం నిధులు కేటాయిస్తే తప్పేందుకో చెప్పాలి.

– శైలకుమార్, టీటీడీ సప్తగిరి మాసపత్రిక, రిటైర్డ్ సంచాలకుడు

నేటికీ ఎగువ తిరుపతి అంటారు



స్థానికులు మినహా పొరుగు ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు నేటికీ తిరుమలను ఎగువ తిరుపతిగా, తిరుపతి నగరాన్ని దిగువ తిరుపతిగా పిలుస్తారు. అంటే భక్తులు, ప్రపంచం దృష్టిలో తిరుమల–తిరుపతి వేరు కాదు. అలాంటప్పుడు తిరుమల తరహాలో తిరుపతిని కూడా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత టీటీడీపై ఉంది. టీటీడీ భాగస్వామ్యాన్ని స్వాగతించాల్సిన వ్యక్తులు నగర అభివృద్ధిని అడ్డుకునేలా విమర్శలు చేయడం సిగ్గుచేటు. ఇలాంటి వారి వల్లా తిరుపతికి ఆటంకమే తప్ప ఎలాంటి ఉపయోగం ఉండదు. అవసరమైతే తిరుపతి రహదారుల బాధ్యతల్ని టీటీడీకే అప్పగించాలి.

– ప్రకాష్, వ్యాపారి, తిరుపతి

చరిత్ర హీనులుగా మిగిలిపోతారు



తిరుపతి అభివృద్ధిని, టీటీడీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. మరింత అభివృద్ధి కావాలనే వ్యక్తులను చూశాను. మీడియాలో కనిపించేందుకు కొన్ని దుష్టశక్తులు నిత్యం ఏదో ఒక వివాదాన్ని తెరపైకి తీసుకొస్తుంటారు. ఒక శాతం నిధులు తిరుపతి కోసం ఖర్చు చేస్తే తప్పేంటి. తిరుపతిలో యాత్రికులకు మంచి సౌకర్యాలు, వసతులు, పరిశుభ్రత కల్పిస్తే ప్రపంచవ్యాప్తంగా టీటీడీకే పేరు ప్రతిష్టలు వస్తాయి. మీరే చేయరు, చేసేవాళ్లను చేయనీయరా?. తిరుపతిలో ఎప్పుడూ లేని అభివృద్ధి జరుగుతోంది. అలానే జరగనివ్వండి.

– యాసారపు మంజుల, వ్యాపారి, తిరుపతి

ఆ పార్టీ పాత్రపై చర్చ జరగాలి



హిందూమతం తమ పేటెంట్ హక్కుగా భావించే ఓ జాతీయ పార్టీ తిరుపతి, తిరుమల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుందో చెప్పాలి. మక్కా, మసీదుల కోసం ముస్లిం దేశాలు, వాటికన్ సిటీ, జెరూసలేం, చర్చిల క్రైస్తవ పెద్దలు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారో గుర్తించండి. సనాతన ధర్మానికి, ఆధ్యాత్మిక రాజధానిగా విరాజిల్లుతున్న తిరుమల అభివృద్ధికి దశాబ్దంగా ఆ పార్టీ ఎలాంటి ప్రణాళికలు రచించిందో చెప్పాలి. రోజూ లక్ష మంది వచ్చే యాత్రా స్థలం తిరుపతి ప్రాంతానికి ఏం చేశారో తెలిపారు. తిరుపతి అభివృద్ధిని అడ్డుకోవడం మంచిది కాదు.

– టి.దాసు, టీటీడీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కోశాధికారి

అందరూ మద్దతు ఇవ్వాల్సిన అంశం



తిరుమల శ్రీవారి భక్తులకు సదుపాయాలు, తిరుపతి నగర సమగ్రాభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలోని ధర్మకర్తల మండలి సాహసోపేత నిర్ణయం తీసుకుంది. అభివృద్ధి కోరే ప్రతి ఒక్కరూ దీన్ని సమర్థించాలి. టీటీడీలో ఏదో జరుగుతోందని శ్రీవారి భక్తుల్లో ఆందోళన రేకెత్తించే ప్రయత్నం చేయడం నీచం. తిరుపతిని, తిరుమలను వేరుచేసి చూడలేము. యాత్రికులతోపాటు విద్య కోసం వివిధ రాష్ట్రాల నుంచి తిరుపతి వందలాదిగా తరలివస్తారు. క్లీన్ తిరుపతి కోసం టీటీడీ బాధ్యత తీసుకోవడం మంచిదే.

–శ్రీలక్ష్మి, ఎంబీయే, ఎల్ఎల్‌బీ, తిరుపతి

వైకుంఠపురం రోడ్డు అభివృద్ధికి కృషి



రోడ్డు నిర్మాణంపై టీటీడీ ఇంజినీర్, అధికారులతో చర్చిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: వైకుంఠపురం రోడ్డును అభివృద్ధి చేసి కొత్త వైభవం తీసుకొస్తామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఇతర ఇంజినీర్లతో కలిసి వైకుంఠపురం రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి నగరంలో రోడ్ల అభివృద్ధి ఉద్యమ స్ఫూర్తితో చేపట్టామన్నారు. ఈ క్రమంలో అధ్వానంగా ఉన్న వైకుంఠపురం మాస్టర్ ప్లాన్ రోడ్డును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. నగరంలోని 11 రోడ్ల నిర్వహణ బాధ్యతలను టీటీడీ నిర్వహిస్తోందన్నారు. ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్, వైకుంఠపురం రోడ్డు నుంచి తుమ్మలగుంట వరకు డిసెంబర్ నాటికి 60 అడుగుల మాస్టర్ ప్లానర్ రోడ్డును పూర్తి చేసి నగరవాసులకు అందుబాటులోకి తెస్తామన్నారు. వైకుంఠపురం ఆర్చి నుంచి మహిళా యూనివర్సిటీ కూడలి వరకు పూర్తిస్థాయిలో కొత్త రోడ్డును అభివృద్ధి చేస్తామని, క్లోజ్డ్ డ్రైన్ నిర్మాణాన్ని చేపడతామన్నారు. అలాగే ఎంఆర్ పల్లి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ నుంచి వైకుంఠపురం ఆర్చ్ వరకు కూడా రోడ్డును బాగు చేస్తామని పేర్కొన్నారు. టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శేఖర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కుమార్, మబ్బు నాదముని రెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ, గృహ నిర్మాణ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. ఆమె బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, నగరపాలక సంస్థ, గృహ నిర్మాణ శాఖ డీఈలు, అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనక్‌లో తిరుపతి విద్యార్థి ప్రతిభ





వర్కింగ్ మోడల్, గైడ్ టీచర్‌తో మూర్తి చేతన్

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో తిరుపతికి చెందిన భారతీయ విద్యాభవన్ పాఠశాల విద్యార్థి మూర్తిచేతన్ ప్రతిభ చూపాడు. విద్యార్థి మూర్తిచేతన్ గైడ్ టీచర్ డి.విజయలక్ష్మి నేతృత్వంలో లిక్విడ్ ఫర్టిలైజర్ డిస్పెన్సర్(మాన్యువల్) వర్కింగ్ మోడల్‌ను తయారుచేశాడు. ఆ మోడల్ జాతీయ స్థాయికి ఎంపికైంది. అక్కడా విద్యార్థి గెలుపొందడంతో తిరుపతి డీఈవో వి.శేఖర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ భానుప్రసాద్ అభినందనలు తెలిపారు.

రీ సర్వే ప్రారంభం

పాకాల: మండలంలో బుధవారం రీ సర్వే కార్యక్రమం తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఇందులో భాగంగా రెవెన్యూ అధికారులు మద్దినాయనపల్లి సచివాలయంలో రైతులతో సమావేశమయ్యారు. డీటీ పరదేశి మాట్లాడుతూ రీ సర్వేతో 100 ఏళ్ల భూ సమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు. సర్పంచ్ గిరిధర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మునీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేంద్ర, మండల సర్వేయర్లు గోపీనాథ్, అమర్‌నాథ్‌రెడ్డి, కార్యదర్శి అబిద్, వీఆర్వో దయాకర్ పాల్గొన్నారు.

యువతీయువకుల ఆశయం గొప్పగా ఉండాలి



మాట్లాడుతున్న టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి

తిరుపతి సిటీ : యువత గొప్ప ఆశయాన్ని నిర్దేశించుకొని దాన్ని సాధించుకునే దిశగా అడుగులు వేయాలని టీటీడీ డీఈవో ఎం.భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం స్టూడెంట్స్ కౌన్సిల్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 34 విద్యాలయాల్లో నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. త్వరలో మూడు డిగ్రీ కళాశాలలకు అటానమస్ హోదా రానుందని తెలిపారు. ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల హానర్స్ డిగ్రీని ప్రారంభించామని వివరించారు. బలహీనతలు, భయాలను వదిలి కలలను సాకారం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ మహదేవమ్మ కళాశాల ప్రాధాన్యతను, అధ్యాపకుల కృషి, విద్యార్థుల ప్రతిభను వివరించారు. కళాశాల టాపర్‌గా నిలిచిన 16 మంది విద్యార్థినులను ఆఫీస్ బ్యారర్లుగా ఎంపిక చేసి డీఈవో చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్టూడెంట్స్ కౌన్సిల్ ఇన్‌చార్జి భువనేశ్వరీ దేవి, భద్రమణి, లక్ష్మీ, ఉమాదేవి, హేమలత, నీరజ, నాగపద్మ, విద్యాలత పాల్గొన్నారు.

జగనన్నతోనే నాయీబ్రాహ్మణులకు గుర్తింపు



ఎమ్మెల్యే భూమనను సత్కరిస్తున్న తొండమల్ల పుల్లయ్య తదితరులు

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే నాయీబ్రాహ్మణులకు సముచిత స్థానం దక్కిందని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లయ్య తెలిపారు. ఆయన రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయనకు బుధవారం టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో నియామక పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను పుల్లయ్యతోపాటు నాయీబ్రాహ్మణులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 7వ డివిజన్ ఇన్‌చార్జ్ చిమట రమేష్, కార్పొరేటర్ నారాయణ, ఉదయగిరి రమేష్, నాయకులు సాకం ప్రభాకర్, లవ్లీ వెంకటేష్ పాల్గొన్నారు.

టీటీడీ కాంట్రాక్ట్ కార్మికుల జీతాల పెంపుపై హర్షం



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

తిరుపతి మంగళం: టీటీడీ కాంట్రాక్ట్ కార్మికుల జీతాల పెంపుపై సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు రూ.5 వేల జీతం పెంచి దసరా పండుగను ముందే తీసుకువచ్చిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ, అధ్యక్షుడు కే.కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారు. వారు బుధవారం ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సత్కరించారు. రూ.5 వేలు వేతనం పెంచి 15 వేల మంది కార్మికుల కుటుంబాల్లో సంతోషాన్ని నింపిన దేవుడు భూమన అని కొనియాడారు. సీపీఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ చంద్రశేఖర్ రెడ్డి, సర్దార్, శివ, శ్రీరాములు, నాయకులు మహేంద్ర, సురేష్, ప్రమీల, అల్లా బకస్ పాల్గొన్నారు.

ప్రతి గడపలోనూ విశేష ఆదరణ



గ్రామస్తులకు పథకాలు వివరిస్తున్న హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి ప్రతి గడపలోనూ విశేష ఆదరణ లభిస్తోంది. చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి బుధవారం నడవలూరు, రేణుకాపురం, నడవలూరు దళితవాడలో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు పరుస్తున్న నవరత్నాల పథకాలను వివరించారు. వారు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నడవలూరు పంచాయతీలో సుమారు రూ.3.95 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, ఆర్సీపురం ఇన్‌చార్జి గణపతి నాయుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సర్పంచు గణపతిరెడ్డి, పంచాయతీ కన్వీనర్ గంగరామిరెడ్డి, మాజీ సర్పంచు లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు రాము, ఎంపీటీసీ రాజేష్, నాయకులు నీలకంఠారెడ్డి, గిరిధర్‌రెడ్డి, యోగానందరెడ్డి, యశ్వంత్, గోపీచౌదరి, చెంచు కిశోర్, హర్షవర్ధన్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

టీటీడీ నిర్ణయాలను వ్యతిరేకించడం దుర్మార్గం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత శేఖర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర అభివృద్ధికి టీటీడీ తీసుకున్న నిర్ణయాలను బీజేపీ నేతలు వ్యతిరేకించడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ ఎంఆర్ పల్లి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం నిత్యం భక్తులు లక్షలాది మంది తిరుపతి నగరానికి వస్తుంటారన్నారు. వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత టీటీడీకి ఉందన్నారు. దీన్ని రాజకీయం చేస్తూ బీజేపీ నేతలు విమర్శలకు దిగుతూ అభివృద్ధిని అడ్డుకోవడం తగదని మండిపడ్డారు. ఇప్పటికైనా విమర్శలు మానుకుని తిరుపతి నగర అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. కార్పొరేటర్ సునీత, టౌన్ బ్యాంకు డైరెక్టర్ అనిల్ రాయల్, నేతలు మబ్బు నారాయణరెడ్డి, కుమార్, సిద్ధంబాబు, బ్రహ్మానందరెడ్డి, కిషోర్, చంద్రశేఖర్ రాయల్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ నిర్ణయంపై బీజేపీ రాద్ధాంతం తగదు

తిరుపతి కల్చరల్: తిరుపతి అభివృద్ధిపై టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయంపై బీజేపీ నేతలు రాద్ధాంతం చేయడం విడ్డూరమని స్థానిక హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు డీఎంసీ.భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవారి భక్తులు తొలి అడుగు పెట్టేది తిరుపతి నగరంలోనేనన్న విషయం బీజేపీ నేతలు విస్మరించి పసలేని విమర్శలు చేయడం సిగ్గుమాలిన చర్య అని తెలిపారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.

టీటీడీ నిధులు ఇవ్వడం హర్షణీయం

తిరుపతి అభివృద్ధికి టీటీడీ తన బడ్జెట్‌లో ఒక శాతం నిధులు కేటాయించడం అభినందనీయమని టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి కె.గుణశేఖర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. టీటీడీ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు నివాసముంటున్న తిరుపతి నగర అభివృద్ధి టీటీడీ అభివృద్ధిగానే భావించాలని పేర్కొన్నారు. టీటీడీ నిర్ణయానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు స్పష్టం చేశారు.

బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర అభివృద్ధికి టీటీడీ తన వార్షిక బడ్జెట్‌లో ఒక శాతం నిధులు కేటాయించడంపై రాజకీయం చేస్తున్న బీజేపీ నేతలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ చిత్తూరు ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆర్.హరికృష్ణ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీలో ఏళ్ల తరబడి చాకిరీ చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీతం రూ.5 వేలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలిపారు.

బీజేపీ తప్పుడు ప్రచారాన్ని ఖండించాలి

తిరుపతి అభివృద్ధికి టీటీడీ ఒక్క శాతం నిధులు కేటాయించడంపై బీజేపీ నేతలు చేస్తున్న రాజకీయాన్ని ఖండిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ అంటేనే తిరుమల, తిరుపతి దేవస్థానం అని తెలియకుండా బీజేపీ నేతలు మాట్లాడడం విడ్డూరమని తెలిపారు. బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే టీటీడీ చెల్లించే జీఎస్టీని రద్దు చేయించాలని సూచించారు.

తిరుపతి అభివృద్ధికి టీటీడీ సహకారం శుభ పరిణామం



మురళీరెడ్డి

తిరుపతి సిటీ: తిరుపతి అభివృద్ధిలో టీటీడీ భాగస్వామ్యం కావడం శుభ పరిణామని వైఎస్సార్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురళీ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. తిరుపతి అభివృద్ధి చెందితేనే తిరుమల అభివృద్ధి చెందినట్టన్నారు. ప్రధానంగా టీటీడీ ఆధ్వర్యంలోనే విశ్వ విద్యాలయాలు తిరుపతిలో వెలిశాయని, ఇందుకు సహకరించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



పాకాల: మందుల కిట్‌ను అందజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి





చంద్రగిరి: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ, రామచంద్రాపురం: మందులందజేస్తున్న ఎంపీటీసీ మంజుల

జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదల ఆరోగ్యానికి రక్ష

పాకాల: రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఇరంగారిపల్లిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. స్థానికులతో మాట్లాడి ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ పేదలు ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారని తెలిపారు. వారికి కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద వైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. 8వ రోజు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 382 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో ప్రభాకర్, సర్పంచు వసంత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీటీసీ కస్తూరి, నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు

చంద్రగిరి: పేదల ఇళ్ల ముంగిటకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని శానంబట్ల పంచాయతీలో బుధవారం సర్పంచ్ యశోద ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు సర్పంచ్ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, ఎంపీడీవో రమేష్ బాబు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జగనన్న సురక్ష క్యాంపులో 412 మంది వైద్య సేవలు పొందినట్టు వైద్యులు తెలిపారు. సెక్రటరీ నజీర్‌బేగం, నాయకుడు శంకర్ యాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

రామచంద్రాపురం: మండలంలోని సీకాలేపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎంపీటీసీ మంజుల, నాయకులు సిద్ధమునిరెడ్డి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

భాకరాపేట: పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుచేస్తున్నట్టు చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దిగవూరు సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యులు అలెగ్జాండర్, శశికళ, నరేష్‌నాయుడు, సర్పంచులు శంకర్‌రెడ్డి, కుమారి, బాబీ, ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.